క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నంద్యాలకు చెందిన శాంతిరాం ఆస్పత్రి వైద్యులు 200 మంది విద్యార్థులకు కంటి సంబంధ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం కంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాన్ మేరి, ప్రిన్సిపాల్‌గీతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్‌కు వినతి పత్రం అందజేశారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

సమస్యలపై వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

డోన్ రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి తహసీల్దార్ నాగమణి వినతిపత్రాలు స్వీకరించారు. ఆయా సమస్యలను విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ముఖ్యంగా రైతుల నుంచి భూ సమస్యలపై వినతులు వస్తున్నాయని.. త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

మున్సిపల్ కార్మికురాలి మృతికి నివాళి



పెద్దక్క కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: మున్సిపల్ కార్మికురాలు పెద్దక్క(50) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కొత్తపేటలోని మృతురాలి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్మికురాలి కుటుంబ సభ్యుల్లో ఒకరికి మున్సిపాలిటీలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట 3వ వార్డు కౌన్సిలర్ వెంకటేశ్వరమ్మ, వంశీ, శానిటరీ సూపర్‌వైజర్లు లక్ష్మిరెడ్డి, దానం, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ చంద్రుడు పర్యవేక్షించారు.

19న టంగుటూరులో పెద్దమ్మ జాతర

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు గ్రామంలో ఈ నెల 18, 19 తేదీల్లో పెద్దమ్మ జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరి సహకారంతో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

పనిచేసినా పైసల్లేవ్..!

- రెండు నెలలుగా అందని ఉపాధి కూలి
- కూలీల జీవితం దుర్భరం
- మండలంలో సుమారు రూ.1.20 కోట్ల బకాయి
- ఆందోళనలో కూలీలు, తప్పని వలసలు

బనగానపల్లె రూరల్: రోజు పనులు చేస్తే గాని పూట గడవని పరిస్థితి. రెక్కలు విరిగేలా కష్టపడినా సరైన సమయానికి కూలీ అందకుంటే వారి కష్టాలు వర్ణణాతీతంగా ఉంటాయి. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీల పరిస్థితి అలానే ఉంది. రెండు నెలల నుంచి వేతనాలు అందక దుర్భర జీవితం గడుపుతున్నారు. చేసేది లేక కొందరు వలస బాట పడుతున్నారు.

హామీ ఏదీ..?

'అడిగిన వారందరికీ జాతీయ ఉపాధి హామీ పనులు కల్పిస్తాం.. సకాలంలో వేతనాలు చెల్లిస్తాం.. వలసలను నివారణే ఉపాధి పనులు' అంటూ అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నాయి. గ్రామాల్లోనే ఉపాధి పనులు చేసుకుంటూ కాలాన్ని గడిపేస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం భరోసా ఇవ్వడం లేదు. చేసిన పనులకు వేతనాలు అందక కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.


మండలంలో 23,476 మంది కూలీలు

మండలంలోని చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఉపాధిపనే శరణ్యంగా మారింది. పనికి తగిన వేతనం సక్రమంగా రాకపోయినా వ్యవసాయ కూలీలు సైతం ఉపాధి పనులకు వెళ్తుంటారు. బనగానపల్లె మండలంలో మొత్తం 13,110 జాబ్‌కార్డులు ఉండగా ఇందులో 10,383 కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 23,476 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం ప్రతి రోజు ఉపాధి పనికి 2,500 నుంచి 3 వేల మంది ఉపాధి పనికి వెళ్తున్నారు. అయితే ఉపాధి పనికి వెళ్లి కష్టపడినా సరైన సమయానికి ప్రభుత్వం వేతనం చెల్లించడం లేదు. మండలంలో గత జనవరి 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ, మినీ గోకులాలు, మెటీరియల్ కాంపోనెంట్ బిల్లు మొత్తం రూ.3.26 కోట్లు పెండింగ్‌లో ఉండగా ఇందులో కూలీల వేతనాలు రూ.1.20 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఉపాధి పనికి సంబంధించిన వేతనాలను ప్రభుత్వం సక్రమంగా చెల్లించకపోవడంతో చాలా గ్రామాల్లోని కూలీలు ఇతర మండలాలు, జిల్లాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు. ఆటోల్లో వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామంలోనే ఉపాధి పని కల్పించి సకాలంలో వేతనం చెల్లిస్తే తమకు వలసలు వెళ్లే అవకాశం ఉండదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఏడు వారాల కూలి రావాల్సి ఉంది



ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాను. అయితే ఏడు వారాల నుంచి పనికి సంబంధించిన వేతనం రాలేదు. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. అధికారులు కూలీ డబ్బుల గురించి అడిగితే వస్తుందిలే అని చెబుతున్నారనే గాని ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ఇలా అయితే ఉపాధి పనులపై కూలీలకు నమ్మకంపోతుంది. ప్రభుత్వం స్పందించి కూలీలను ఆదుకోవాలి.

–రామసుబ్బయ్య, ఉపాధి కూలీ, బనగానపల్లె

కుటుంబం గడవడం కష్టం



మా కుటుంబ జీవనం ఉపాధి కూలీ పనులపైనే ఆధారపడి ఉంది. నాకు పదివారాల వేతనం రావాల్సి ఉంది. చేసిన పనులకు కూడా కూలీ ఇవ్వకపోతే ఎలా. రోజువారి కుటుంబ అవసరాలకు డబ్బులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

–చెన్నబోయిన మధుసూదన్, ఉపాధి కూలీ, పెద్దరాజుపాళెం గ్రామం

నెలాఖరులోపు నిధులు మంజూరు



ఈ నెల చివరిలోపు ఎన్‌ఆర్‌జీఎస్ కూలీలకు సంబంధించి వేతనాలు విడుదలవుతాయని ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీలకు వేతనాలు చెల్లిస్తాం. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నాం. మండలంలో సుమారు రూ.1.20 కోట్ల కూలీల వేతనాలు విడుదల కావాల్సి ఉంది.

–రేష్మా, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఓ, బనగానపల్లె మండలం

పనిభారం తగ్గించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

బనగానపల్లె రూరల్: పనిభారం తగ్గించి ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ బీవీ రమణ, ఇన్‌చార్జీ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సర్వేలు, కార్యక్రమాలతో ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. మొత్తం 13 రకాల సర్వేలతో పాటు పంచాయతీల్లో 26 సేవలు చేయాల్సి ఉందన్నారు. తమకు పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లె, ఆర్.బుక్కాపురం గ్రామాల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఆయా గ్రామస్తులకు కంటి పరీక్షలు చేసి 28 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు కంటి వైద్యులు తులసీ కుమార్, చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. ఆర్ బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు లక్ష్మన్న, మునేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

డోన్ రూరల్: గ్రామాల్లో బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించే సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌బీఎస్ ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొత్తరావు నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని తిరునాంపల్లి గ్రామంలో జరుగుతన్న ఎన్‌హెచ్ యాప్-5 సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో బీపీ, షుగర్ రోగులను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే వారికి వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ కె.చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేష్, వైద్య సిబ్బంది పద్మావతి, వెంకట్, తిప్పన్న, ఆశావర్కర్ వెంకటేశ్వరమ్మ ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కొత్తరావు నాయక్

విద్యుత్ స్తంభాలు మార్చాలి

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కేఈ కృష్ణమూర్తినగర్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు, లైన్లను మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం కేఈ కృష్ణమూర్తినగర్‌లో ఆ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, నక్కి హరి, మధుతో కలిసి పర్యటించారు. కాలనీ ఏర్పాటై ఏడేళ్లు అవుతున్న ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇళ్లపై, వీధుల్లో అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉండడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సమస్యల చెంత.. వారపు సంత

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతలో సమస్యలు తిష్టవేశాయి. రెండు దశాబ్దాల నుంచి సంత నిర్వహిణ చేసున్నా నేటికి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదట్లో దస్తగిరి స్వామి దర్గా సమీపంలో సంత నిర్వహించారు. తర్వాత పోస్టాఫీసు దారిలో ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండడంతో మార్పు చేశారు. ప్రస్తుతం తేరు సమీపంలోని వ్యవసాయ పొలంలో నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే సంతకు సుమారు పది గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. 150 మందికి పైగానే వ్యాపారులు ఇక్కడ సరుకుల అమ్మకాలు చేస్తుంటారు. ప్రస్తుతం ఎండల కాలం కావడంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు నిలువ నీడ లేక పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాకాలంలో చిన్న పాటి వర్షం కురిసినా అస్తవ్యస్తంగా మారిపోతుంటుంది. ఏటా సంతకు వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయినా సంతకు సొంత స్థలం ఏర్పాటుతో పాటు సదుపాయాలు లేకుండాపోయాయి. పంచాయతీ అధికారులు పరిష్కారం చూపాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.



ఎండకు పట్టలు కప్పుకుని వ్యాపారాలు



దారిలోనే అంగళ్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



బనగానపల్లెలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



కోవెలకుంట్ల: పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. బనగానపల్లె మండలంలో మొత్తం 9 పరీక్ష కేంద్రాల్లో 1,560 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,437 మంది హాజరైనట్లు ఎంఈఓ-2 శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బనగానపల్లె సీఐలు మంజునాథ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేతంచెర్లలో 18 మంది గైర్హాజరు

బేతంచెర్ల: మండలంలో 6 పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు తెలుగు పరీక్షకు 1095 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తోడు వచ్చి భయపడవద్దని, ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు.

సంజామలలో ఆరుగురు..

సంజామల: మండలంలో సంజామల ప్రభుత్వ పాఠశాల, నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు జరిగాయి. ఈ మూడు కేంద్రాల్లో 402 మంది విద్యార్థులకు గాను 396 మంది హాజరైనట్లు.. ఆరుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కోవెలకుంట్లలో ఐదుగురు

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 281 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా నలుగురు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 234 మందికిగాను ఒకరు గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు సుందరయ్య, అరుణకుమారి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కోవెలకుంట్ల, ఇల్లూరు కొత్తపేట పాఠశాలల ఉపాధ్యాయులు మల్లికార్జున, పాండు రంగారెడ్డి వ్యవహరించారు.

డోన్‌లో 14 మంది

డోన్ టౌన్: పట్టణంలో మొత్తం 8 కేంద్రాల్లో 1548 మంది విద్యార్థులు మొదటి రోజు పదో తరగతి పరీక్షలు రాశారు. 14 మంది గైర్హాజరయ్యారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లోని 2 కేంద్రాల్లో 265 మంది విద్యార్థులు, గరల్స్ హైస్కూల్‌లోని రెండు కేంద్రాల్లో 444 మంది, ఓనైరో స్కూల్‌లోని రెండు కేంద్రాల్లో 341 మంది, మోడల్ స్కూల్‌లో 271 మంది, శాంజ్యో స్కూల్ 241 మంది హాజరయ్యారు.

కొలిమిగుండ్లలో నలుగురు గైర్హాజరు

కొలిమిగుండ్ల: మండలంలో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలల్లో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరయ్యారు. నాలుగు కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు పెద్ద ఎత్తున వచ్చారు. అంకిరెడ్డిపల్లె పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సీఐ రమేష్‌బాబు పరిశీలించారు.

ప్యాపిలిలో 16 మంది

ప్యాపిలి: మండల పరిధిలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు 752 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 736 మంది హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తెలిపారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.



డోన్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కొలిమిగుండ్ల పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

ప్యాపిలి: స్థానిక జామియా మసీదులో సోమవారం పేద ముస్లిం మహిళలకు రంజాన్ సందర్భంగా చీరలు, నగదు పంపిణీ చేశారు. ప్యాపిలికి చెందిన ఇస్మాయిల్ హైదరాబాదులో స్థిరపడ్డారు. ఈయన, కుమారుడు జాకీర్ ఏటా రంజాన్ సందర్భంగా పేదలకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఈ మేరకు వారు పంపిన రూ. 70 వేలతో వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు మహబూబ్ సాహెబ్ తెలిపారు. హఫీజ్ సాహెబ్ మహబూబ్ ఖాన్, కమిటీ అధ్యక్షుడు మస్తాన్ ఖాన్, ఖాజాపీర్, అల్‌మదత్, మహబూబ్ బాషా చేతుల మీదుగా 25 మంది మహిళలకు చీరలు, రూ. 250 చొప్పున పింఛన్, పండుగ ఖర్చులకు రూ.300 అందజేశారు. మదరాసాలో చదువుతున్న బాలురకు దుస్తులు, బాలికలకు స్కార్ఫ్‌లు అందజేశారు. అలాగే మదరా బోధకులకు ప్రతి నెలా రూ. 4,500 చొప్పున వేతనం అందజేస్తున్నట్లు తెలిపారు.



చీరలు పంపిణీ చేస్తున్న మత పెద్దలు

పొగాకు పంటకు నిప్పు

బనగానపల్లె: మండలంలోని కాపులపల్లె గ్రామంలో నామాల కృష్ణయ్యకు చెందిన రూ.1.50 లక్షల విలువైన పొగాకు పంట కల్లంలో ఉండగా ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైనట్లు బనగానపల్లె పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రమాదవశాత్తు జరిగిందా ఎవరైనా కావాలనే చేశారా అని విచారణ చేస్తున్నామని తెలిపారు.

బాధ్యులపై చర్యలు

మండలంలోని కాపులపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి, సర్పంచ్ తులసిరెడ్డితో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నామాల కృష్ణయ్యకు చెందిన పొగాకు పంట కాలిపోవడం దురదృష్టకరమన్నారు. దర్యాప్తులో ప్రమాదానికి కారకులు గుర్తిస్తే వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామస్తులు ప్రశాంతంగా ఉండాలని సూచించారు.



అగ్నికి ఆహుతైన పొగాకు పంట



కాపులపల్లిలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

రేపటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నుంచి ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 19వ తేదీ, 25వ తేదీల్లో కోవెలకుంట్ల రెండో సచివాలయం, ఈ నెల 20న భీమునిపాడు, 26న కోవెలకుంట్ల-3, రేవనూరు సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 21, 27వ తేదీల్లో కోవెలకుంట్ల 4, 5 గ్రామ సచివాలయాలు, బిజనవేముల, సొదరదిన్నె, ఈ నెల 22, 28వ తేదీల్లో గుళ్లదూర్తి, చిన్నకొప్పెర్ల గ్రామ సచివాలయాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా

బేతంచెర్ల: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్, నాయకులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా వేలం పాట

ప్యాపిలి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేలం పాట పోటాపోటీగా సాగింది. సర్పంచ్ లక్ష్మిదేవి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్‌గౌడ్ వేలం పాట నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వారపుసంత, కూరగాయల మార్కెట్, బస్టాండ్, మాంసపు మార్కెట్‌కు సర్కారు పాటను రూ.9.9 లక్షలుగా నిర్ణయించారు. రామకృష్ణ, నాగేంద్ర, బోరెడ్డి రఘునాథ్ రెడ్డి, కొండప్ప, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. రూ.10 లక్షలతో ప్రారంభమైన పాటను పాటదారులు అంతకంతకు పెంచుకుంటూ పోయారు. చివరకు నడిగడ్డ నాగేంద్ర రూ. 11,48,000కు దక్కించుకున్నాడు. గత ఏడాది రూ. 8,41,000కు పాటదారుడు వేలం దక్కించుకోగా ఈ ఏడాది రూ. 3,07,000 అధికంగా పలకడంతో గ్రామ పంచాయతీకి అధికంగా ఆదాయం సమకూరింది.



వేలం నిర్వహిస్తున్న ఈఓఆర్డీ, సర్పంచ్

సమాజ సేవతో ఆత్మసంతృప్తి

బేతంచెర్ల: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సరస్వతి శిశు మందిర్‌లో 7వ తరగతి చదువుతున్న మధులత అనే విద్యార్థిని ఫీజు కోసం రూ.10,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రమణారెడ్డి, మధు మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదును అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

గ్రంథాలయ పన్ను బకాయిలు చెల్లించాలి

బనగానపల్లె రూరల్: గ్రంథాలయశాఖకు బకాయి ఉన్న పన్నులను చెల్లించాలని గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ బీవీ రమణకు వినతి పత్రం అందజేశారు. బనగానపల్లె పంచాయతీలో 2003 నుంచి ఇప్పటి వరకు రూ.24,44,864 చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.